క్లుప్తంగా

ప్రమాదకర గుంత పూడ్చరూ



పొన్నూరు: మండలంలోని కసుకర్రు గ్రామ ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. ఈ దారిలో ప్రయాణించాలంటే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో గుంత కనపడక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఈ దారి వెంట సీతారాంపురం, ఉప్పరపాలెం, ప్రత్తిపాడు మండలంలోని పలు గ్రామాలకు నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా మారిన గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

పేద కుటుంబానికి చేయూత



పొన్నూరు: పేద కుటుంబానికి చెందిన చందోలు వాసి షేక్ జాకీర్ హుస్సేన్ కుమార్తె వివాహానికి కానుకగా ఎంఎం యూత్ ఆధ్వర్యంలో బుధవారం బీరువా బహూకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల వెంకటేశ్వర రావు, మొహమ్మద్, అంజుమన్ కమిటీ గౌరవాధ్యక్షులు షేక్ మహమ్మద్, ఉపాధ్యక్షులు మొల్ల నసురుద్దీన్ బాషా, డైరెక్టర్ సయ్యద్ జాని, మైనార్టీ నాయకులు షేక్ పీరు, నాగూర్, రియాజ్, నయుం పాల్గొన్నారు.

చలపతిలో సాప్ హ్యాక్‌ఫెస్ట్



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్‌ఏపీ ల్యాబ్స్, నెక్స్ గ్రిడ్స్ సంస్థ, కళాశాల సంయుక్తంగా బుధవారం సాప్ హ్యాక్‌ఫెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నెక్ట్ గ్రిడ్ మేనేజర్ కె.దర్శన్ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక రంగంలో సాప్ ఆవశ్యకతను వివరించారు. ఎస్‌ఏపీ ల్యాబ్స్ ప్రతినిధి మంజునాథ్ మాట్లాడుతూ సస్టైనబుల్ బిజినెస్ ప్రివెంటింగ్ డిజిల్ ప్రాబ్ ఎథిక్స్ ఇన్ ఏఐ మోడల్స్ ఫర్ బిజినెస్ అనే అంశంపై అవగాహన కల్పించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ హాజరయ్యారు.

మహిళపై దాడిచేసి నగదు చోరీ

పట్నంబజారు: మహిళపై దాడిచేసి ఆమె వద్ద ఉన్న నగదు లాక్కొని పోయిన ఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. నెల్లూరు జిల్లాకు చెందిన కృష్ణవేణి అనే మహిళ గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతంలో వ్యభిచారం చేస్తుంటుంది. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఆమె వద్దకు ఓ వ్యక్తి వచ్చి బేరం మాట్లాడుకున్నాడు. మణిపురం ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లోకి తీసుకెళ్లాడు. అక్కడ మరో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. నలుగురు కలిసి ఆమెపై దాడిచేసి బెదిరింపులకు గురిచేసి ఆమె వద్ద ఉన్న రూ.వెయ్యి నగదు తీసుకుని పరారయ్యాడు. సదరు మహిళ కూడా మద్యం తాగి ఉండటంతో పెద్ద పెద్దగా కేకలు వేయడంతో అక్కడ స్థానికులు వచ్చే సమయానికి ఆ నలుగురు పారిపోయారు. గ్యాంగ్ రేప్ జరిగిందంటూ పుకార్లు షికార్లు చేసిన నేపథ్యంలో నైట్ డ్యూటీలో ఉన్న దిశ పోలీసుస్టేషన్ సీఐ నారాయణ ఘటనా స్థలానికి చేరుకుని పాతగుంటూరు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన గురించి సమాచారం అందుకున్న నిమిషాముల వ్యవధిలో ఘటనా స్థలానికి పాతగుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వీరసోమయ్య చేరుకున్నారు. మహిళను బెదిరించి డబ్బులు తీసుకెళ్లిన నలుగురిపై కేసు నమోదు చేశారు.

గంజాయి కలిగి ఉన్న వ్యక్తి అరెస్టు

నెహ్రూనగర్: నగర పరిధిలో గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 87.91 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ 2 టౌన్ సీఐ ఎం.యశోధరదేవి తెలిపారు. చుట్టుగుంట సెంటర్ నుంచి వీవీపీ రోడ్డు మార్జిన్ వద్ద నంబూరు సుభాని కాలనీ, పీకలవాగు కట్ట ప్రాంతానికి చెందిన షేక్ మస్తాన్‌వలి గంజాయి ప్యాకెట్ కలిగి ఉండటం గమనించి అతన్ని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకుంటున్నట్లు చెప్పారు.

స్థలం వివాదంలో ఇరువర్గాలపై కేసు

లక్ష్మీపురం: ఓ స్థలం వివాదంలో ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో నగరంపాలెం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శాంతినగర్ ప్రాంతానికి చెందిన జాజుల తిరుపతమ్మ, భర్త ఏడుకొండలు, శ్రీనివాసరావు పేటకు చెందిన పెద్ద మల్లు భాస్కర్, భార్య భూలక్ష్మి శాంతినగర్‌లో ఉన్న ఓ స్థలం విషయంలో మాదంటే మాదంటూ వాగ్వివాదానికి దిగారు. దీంతో ఇరు వర్గాలు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోవడంతో ఇరు వర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జొన్న రైతు నష్టాల బాట

- ముమ్మరంగా జొన్న నూర్పిళ్లు
- గిట్టుబాటు ధర, దిగుబడి తగ్గటంతో ఆందోళన
- వాతవరణ మార్పులతో కలవరపడుతున్న అన్నదాతలు



మంచాలలో యంత్రాలతో తెల్ల జొన్న నూర్పిళ్లు చేస్తున్న కూలీలు

చేబ్రోలు: మొక్కజొన్న, తెల్లజొన్న పంటలను సాగు చేసి లాభాలు గడించాలని ఆశ పడ్డ రైతులకు నిరాశ తప్పటం లేదు. జొన్న రైతుల విషయంలో అధికారులు, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను వ్యాపారులు ఇవ్వటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన దిగుబడులు..

పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని చేబ్రోలు, పెదకాకాని, పొన్నూరు మండలాల్లోని రైతులు ఎక్కువగా రబీలో రెండో పంటగా మొక్కజొన్న, తెల్లజొన్న, అపరాల పంటలను సాగు చేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవటంతో ఈ ఏడాది దిగుబడులు తగ్గాయి. గత ఏడాది ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల తెల్ల జొన్న దిగుబడి వచ్చింది. ఈ ఏడాది 10 నుంచి 20 క్వింటాళ్ల లోపే దిగుబడులు వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. దిగుబడి తగ్గిన్నప్పటికి జొన్న పంటలకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా తక్కువకు కొనుగోలు చేస్తున్నారు.

మద్దతు లేక..

తెల్లజొన్న బహిరంగా మార్కెట్లో క్వింటా రూ.1900 నుంచి రూ.2000లకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర మాత్రం రూ.3371 ఉంది. మొక్కజొన్నకు క్వింటాకు ప్రభుత్వం మద్దతు ధర రూ.2,225 ఉండగా బహిరంగ మార్కెట్లో మొక్కజొన్న ధర మాత్రం క్వింటా రూ.2,000 నుంచి రూ.2100 వరకు ఉంది. చేబ్రోలు మండల కేంద్రంలో ప్రభుత్వం జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ముమ్మరంగా జొన్న నూర్పిళ్లు..



చేబ్రోలులో యంత్రాలతో మొక్కజొన్న హర్వెస్ట్ చేస్తున్న రైతుల

చేబ్రోలు మండలంలోని చేబ్రోలు, వడ్లమూడి, శేకూరు, నారాకోడూరు, వడ్లమూడి, మంచాల, తోట్లపాలెం, శ్రీరంగపురం గొడవర్రు తదితర గ్రామాల్లో సుమారు 7,200 ఎకరాల్లో తెల్లజొన్న, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. జొన్న కోత, నూర్పిళ్లు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొద్ది రోజుల్లో వ్యవసాయ పనులు పూర్తి అయ్యే దశలో ఉన్నాయి. ఈ ఏడాది కూలీ రేట్లు పెరగటంతో ఖర్చులు కూడా బాగా ఎక్కువయ్యాయని రైతులు వాపోతున్నారు. ఎకరానికి జొన్న కోతకు నాలుగు వేలు, కుప్ప వేయటానికి రెండున్నర వేలు, నూర్పిడికి నాలుగువేలు ఖర్చు అవుతున్నట్లు జొన్న రైతాంగం చెబుతున్నారు. మొక్కజొన్న పంటలకు కొంత మంది రైతులు తక్కువ ఖర్చుతో హార్వెస్ట్ ద్వారా నూర్పిళ్లు చేస్తున్నారు. దీని వల్ల యంత్ర సహాయంతో ఎకరానికి రూ.2500లకే ఒకే సారి కోత, నూర్పిడి పనులు పూర్తి అవుతున్నాయి. సమయం ఆదాతో పాటు, తక్కువ ఖర్చుతో పంట ఇంటికి చేరుతున్నట్లు రైతాంగం చెబుతున్నారు. చేబ్రోలు, శ్రీరంగపురం, వడ్లమూడి, నారాకోడూరు ప్రాంతాల్లో కొంతమంది రైతులు హార్వెస్ట్ ద్వారా వ్యవసాయ పనులు పూర్తి చేస్తున్నారు.

మబ్బులతో కలవరం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణితో నాలుగు రోజులుగా చేబ్రోలు మండలంలోని పలు గ్రామాల్లో పడిన వర్షపు జల్లులతో రైతులు బెంబేలెత్తుతున్నారు. కోత దశ, ఓదెల మీద ఉన్న జొన్న పంటలు తడవటంతో పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం జొన్న రైతులు పంట చేతికి అందే దశలో వాతవరణ మార్పులు రైతులను కలవరపరుస్తుంది. గత రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమవుతుండటం, జల్లులు పడటం రైతులను ఆందోళనకు గురిచేస్తుంది. వాతవరణ హెచ్చరికలు అన్నదాతలను కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

గాయపడిన గర్భిణిని కాపాడిన జీజీహెచ్ వైద్యులు



జీజీహెచ్ వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న శివశంకర్‌రావు, శిరీష దంపతులు

గుంటూరు మెడికల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గర్భిణికి నాలుగు గంటలు అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్స చేసి తల్లీబిడ్డను గుంటూరు జీజీహెచ్ వైద్యులు కాపాడారు. వివరాలు... నీలపు శివశంకరరావు, శిరీష దంపతులు తుళ్లూరు మండలం పెద్దపరిమిలో ఆటోలో ప్రయాణిస్తుండగా మార్చి 24 ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న గర్భిణి శిరీష తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రురాలిని 108లో జీజీహెచ్ కాన్పుల విభాగానికి తరలించారు. కాన్పుల విభాగంలో గైనకాలజి వైద్యులు గర్భిణిని పరీక్షించి పలు చోట్ల గాయాలు అయినట్లు నిర్ధారించారు. తలకు, పొట్టలో పెద్ద గాయం అవడం వల్ల లివర్‌కి డామేజ్ ఏర్పినట్లు గుర్తించారు. అత్యంత కిష్టమైన పరిస్థితిలో శిరీష కడుపులో ఉన్న శిశువుకి ఆపరేషన్ చేసి పండంటి బిడ్డను క్షేమంగా బయటకు తీశారు.

లివర్ చీలిపోయింది..

గర్భిణికి గతంలో రెండు పర్యాయాలు గర్భం వచ్చి ఒకసారి బిడ్డ పుట్టి వెంటనే చనిపోవడంతో మూడో గర్భం చాలా కష్టంతో ఉన్నట్లు గుర్తించామని, వైద్యులు తెలిపారు. లివర్ కుడివైపు విభాగంలో చీలిపోయి రక్తస్రావం జరిగి మూడు లీటర్లకు పైగా రక్తం బయటకు రావడంతో ఆస్పత్రికి వచ్చిన రోజే 4 గంటల పాటు శస్త్రచికిత్స చేసి లివర్‌లో నుంచి రక్తం కారడాన్ని నిలుపుదల చేశామని సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ అందె కోటి వెంకటేశ్వరరావు తెలిపారు. గైనకాలజీ, జనరల్ సర్జరీ, న్యూరో సర్జరీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ మొత్తం నాలుగు విభాగాల డాక్టర్లు కలిసి ఆపరేషన్ ద్వారా తల్లీబిడ్డను కాపాడినట్లు వెల్లడించారు. ఆపరేషన్ ప్రక్రియలో తనతోపాటు గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శిరీష, జనరల్ సర్జరీ విభాగాపతి డాక్టర్ పద్మశ్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ వినయ్, మత్తు వైద్య విభాగాధిపతి డాక్టర్ పోలయ్య, డాక్టర్ నాగభూషణం పాల్గొన్నట్లు వెల్లడించారు. నాలుగు వైద్య విభాగాలు ఎంతో కష్టపడి తల్లి, బిడ్డను కాపాడినందుకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ సదరు వైద్య విభాగాల వైద్యులను అభినందించారు. తల్లీబిడ్డని ఇంటికి పంపిస్తున్నందుకు శివశంకర్ రావు, శిరీష దంపతులు జీజీహెచ్ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుద్ధ్య విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు

కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణలో కఠినంగా ఉంటామని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే తగు చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శారదా కాలనీ, దుర్గా నగర్, బస్టాండ్, ఓల్డ్ క్లబ్ రోడ్, గోరంట్ల, అమరావతి రోడ్ తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ చేయడం ద్వారా ప్రధాన ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్ లేకుండా చేయవచ్చని పేర్కొన్నారు. అందుకు పిన్ పాయింట్‌గా పారిశుద్ధ్య పనులు జరిగేందుకు తగిన కార్మికులు, పుష్ కాట్స్, వాహనాలు అందించామన్నారు. అయినప్పటికీ కొందరు కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్ల పనితీరులో మార్పు లేదని, శారదాకాలనీ, దుర్గా నగర్ ప్రాంతాల్లో రోజు ఇంటింటికి చెత్త సేకరణకు కార్మికులు రాని కారణంగా రోడ్ల మీద వ్యర్థాలు వేస్తున్నామని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకురావడంతో ఇన్‌స్పెక్టర్ల పాలపర్తి వెంకటేశ్వర్లుని తక్షణం అక్కడి నుంచి బదిలీ చేయాలని సీఎంఓహెచ్‌ను ఆదేశించారు. సదరు డివిజన్లో సమగ్ర పారిశుద్ధ్య పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌ని ఆదేశించారు. బస్టాండ్, ఓల్డ్ క్లబ్ రోడ్‌లో ప్రతి కమర్షియల్ షాప్ డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, లేని వాటికి అపరాధ రుసుం విధించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. మధ్యాహ్నం సమయంలో కార్మికులు తప్పనిసరిగా డ్రెయిన్లు శుభ్రం చేయాలని, సిల్ట్ కార్మికులను ప్రాధాన్య క్రమంలో డివిజన్లకు కేటాయిస్తామన్నారు. పర్యటనలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎస్ఎస్ జి.ఐజాక్ పాల్గొన్నారు.

ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తున్న ట్రంప్ విధానాలు



మాట్లాడుతున్న విద్యావేత్త విశ్లేషకులు చంద్రయ్య

లక్ష్మీపురం: ప్రపంచ దేశాలను దోచుకుని యుద్ధాలు చేసి బతుకుతున్న అమెరికా, అధిక టారిఫ్‌ల పేరుతో ఆడుకుంటుందని సంస్థ సీనియర్ సభ్యులు, విద్యావేత్త ఇ.చంద్రయ్య అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మేధావుల, విశ్లేషకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మేక్ అమెరికా, గ్రేట్ ఎగైన్ పేరుతో ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌లు, అనుసరిస్తున్న విపరీత పోకడలు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. సంస్థ సభ్యులు విశ్లేషకులు, వి.వి.రావ్, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ట్రంప్ తాజా టారీఫ్‌లతో 6.4 శాతానికి పైగా భారత ఎగుమతులు దెబ్బతింటాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 5.75 లక్షల ఎకరాల్లో రొయ్యలు సాగు చేస్తున్న రైతులు ఆందోళనలో ఉన్నారని చెప్పారు.

ప్రతిఒక్కరికీ నైపుణ్యాలు అవసరం



మాట్లాడుతున్న మద్ది ఈశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: అవరోధాలను అధిగమిస్తూ ముందుకు వెళ్లే నేర్పు, నైపుణ్యాలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అలవర్చుకోవాలని ట్యాలీ సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్ మద్ది ఈశ్వరరావు పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో బుధవారం "సృజన మీలో ఎవరు ఎంటర్‌ప్రెన్యూర్" అనే అంశంపై ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు తాము చేపట్టిన పనిపై నమ్మకంతో ముందుకు వెళ్లి, ప్రతికూల పరిస్థితులను సైతం అనుకూలంగా మార్చుకోవాలని సూచించారు. ట్యాలీ సాఫ్ట్‌వేర్ టూల్స్ వ్యాపార నిర్వహణలో ఎంత కీలకంగా ఉంటాయో తెలుసుకోవాలని, ఖర్చులు ఎక్కడ పెరుగుతున్నాయని, ఎక్కడ లాభం వస్తోందనే విషయాలతో పాటు ఏఏ రికార్డులు అవసరమవుతాయో తెలుసుకోవాలని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, పోటీల కన్వీనర్ చల్లా వైష్ణవి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కళ్యాణి, సహాయాచార్యులు ఏ బాజీబాబు, అభిలాష్, వేదవతి, అనిత, రాజరాజేశ్వరిదేవి పాల్గొన్నారు.

మోదుగుల కుటుంబానికి పరామర్శ



గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీ ఉమ్మడి గుంటూరు జిల్లా పరిశీలకుడు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డిని పార్టీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ బుధవారం పరామర్శించారు. వేణుగోపాలరెడ్డి తండ్రి, సోషలిస్ట్ నేత మోదుగుల పాపిరెడ్డి(88) ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇన్నర్ రింగ్‌రోడ్డు రెడ్డిపాలెంలోని మోదుగుల ఇంటికి వెళ్లి పాపిరెడ్డి చిత్రపటం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు.

చంద్ర రాజేశ్వరరావుకు ఘన నివాళి



పొన్నూరు: స్వాతంత్ర్య సమరయోధుడు, భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు చంద్ర రాజేశ్వరరావు అందించిన సేవలు మరువలేనివని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు అన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయం వద్ద రాజేశ్వరరావు వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు నరసింహారావు, ఎస్.కె రసూల్, జాన్ కుమ్మరిగుంట సామ్యేలు, కోట నరసింహారావు, షేక్ అజీమ్ పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు శిక్షణ తరగతులు

నెహ్రూనగర్: కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఓటర్ క్లెయిమ్స్ పరిష్కారం చేయాలని, ప్రతి క్లెయిమ్‌కు తగిన రిజిస్టర్‌లను బీఎల్‌ఓలు మెయింటైన్ చేయాలని పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ, జీఎంసీ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు బుధవారం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గ బీఎల్‌ఓలకు శిక్షణ సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఏఈఆర్‌ఓలు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, రాంబాబు, సూరజ్ కుమార్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ పద్మనాభరావు పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి



నగరంపాలెం: స్థానిక కొరిటిపాడు గాంధీ బొమ్మ సెంటర్ శ్రీకోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం మహోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రభాతసేవ, స్వామి వారికి విశేష స్నాపన, అర్చన, అలంకార పూజ కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం శ్రీ వాసవి ఈవెంట్స్ ఆధ్వర్యంలో సినీ, భక్తి సంగీత విభావరి జరిగింది. గాయని గాయకులు శైలజ, నందిని, శ్రీనివాస్, రాజేష్ సినీ భక్తి గీతాలను ఆలపించగా, భక్తులను అలరించాయి. కీబోర్డుపై అంజి, ప్యాడ్స్‌పై ప్రసాద్, జాజ్‌పై సామ్యూల్, తబలాపై విజయ్‌పాల్ వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కొమ్మినేని శివకోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కె.ఆదినారాయణ, కోశాధికారి కె.ప్రసాద్, సభ్యులు కె.కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసి పూజ



పూజలో పాల్గొన్న నరసింహ

పొన్నూరు: మండల పరిధిలోని కసుకర్రులోని వేణుగోపాల స్వామి దేవస్థానంలో నాగిశెట్టి నరసింహ ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. నూతన ధ్వజస్తంభ నిర్మాణం సందర్భంగా ఆలయ వంశపారంపర్య అర్చకులు విజితేంద్ర వాస్తు పూజ, లక్ష తులసీ, సహస్రనామవాలి పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

వేణుగోపాల స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 10న ఉదయం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహం, రక్షాబంధనం, అఖండ స్థాపనం, 11న నిత్యోపాసనం, బలిహరణం, హనుమత్ వాహనం, 12న నిత్యోపాసనం, గరుడోత్సవం, సాయంత్రం రథోత్సవం, 13న నిత్యోపాసనం, వసంతోత్సవం, చక్రవారి చూర్ణోత్సవం, సాయంత్రం పూర్ణాహుతి, ధ్వజారోహనం, 14న సాయంత్రం పవలింపుసేవ, ఊంజల్‌సేవ జరుగుతాయని తెలిపారు.

ఎమ్మార్సీలు రెగ్యులర్‌గా ఫీల్డు విజిట్ చేయాలి

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జునరావు



చేబ్రోలులోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న అర్జునరావు

చేబ్రోలు: ఎమ్మార్సీలు రెగ్యులర్‌గా గ్రామాలలో ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బొంతా అర్జున్ రావు అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలు మేజర్ గ్రామ పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూ షెడ్డును బుధవారం పరిశీలించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఈడీ బొంతా అర్జునరావుతో పాటు మరో ఆరుగురు సిబ్బందితో కలిసి వివిధ అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. తాగునీటి నిర్వహణ, మురుగు నీటిపారుదల నిర్వహణ, పారిశుద్ధ్యం గురించి తెలుసుకున్నారు. చేబ్రోలులోని చెత్త సంపద కేంద్రం నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని, తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర, కాకుమాను తదితర మండలాలలకు చెందిన ఎమ్మార్సీలు, క్లాప్ మిత్రులతో సమావేశమయ్యారు. బొంతా అర్జునరావు మాట్లాడుతూ సిబ్బంది ఇంటింటి సర్వే చేసి మరుగుదొడ్లు లేని వారిని గుర్తించాలన్నారు. ప్రభుత్వం మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రభుత్వం చాలా ప్రాధాన్యత ఇస్తున్నదని చెప్పారు. రాష్ట్రం మొత్తం మీద 190 ఎస్‌డబ్ల్యూ షెడ్డులు బెస్ట్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. వాటిలో చేబ్రోలు కూడా ఉందని చెప్పారు. వీటిని రాష్ట్ర స్థాయిలోని ఉన్నతాధికారులు పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.ఉమాదేవి, చేబ్రోలు, పొన్నూరు ఈఓపీఆర్డీలు టి.ఉషారాణి, మల్లికార్జునరావు, స్థానిక పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని నీరుగారుస్తున్న ప్రభుత్వం



కొప్పురావూరులో ఉపాధి హామీ పథకము కూలీలతోమాట్లాడుతున్న సిపిఐ నాయకులు

పెదకాకాని: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగారుస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు అన్నారు. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు, వెనిగండ్ల గ్రామాల్లో బుధవారం ఉపాధి పనులను పరిశీలించారు. ఏపీడీ శివన్నారాయణను పని ప్రదేశాలో కలిపించాల్సిన మౌలిక సదుపాయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి చట్టాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. ఉపాధి హామీ కూలీలకు గత రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న నిధులను మంజూరు చేసి పని ప్రదేశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పని ప్రదేశంలో గుడారాలు వేయించి శీతల పానీయాలు, మజ్జిగ అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ. ఉపాధి కూలీలు మేట్లు (మేస్త్రులు) ఏపీ డి.శివన్నారాయణ పాల్గొన్నారు.

కష్టపడేతత్వంతో ఏ పనిలోనైన విజయం

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: కష్టపడేతత్వం, ప్రణాళికాబద్ధంగా పనులు చేస్తే ఏ పనిలోనైనా విజయం సాధించవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం విజ్ఞాన మందిరంలో స్మార్ట్ టెక్స్, నగర పాలక సంస్థ ఆధ్వరంలో చేపట్టిన మెగా జాబ్ మేళాకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి ఓరియంటేషన్ కార్యమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పస్తుతం ప్రభుత్వ సంస్థలలో కంటే ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగాలు ఎక్కువగా ఉంటున్నాయని, ప్రైవేట్ ఉద్యోగాలు చేయాలంటే ప్రతి పనిలో నిష్ణాతులుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సెక్రటరీ పి. శ్రీనివాసరావు, మేనేజర్ బాలాజీ బాషా, స్మార్ట్ టెక్స్ సంస్థ ప్రతినిధులు దివ్య పాల్గొన్నారు.

మాంసం వ్యర్థాలపై చర్యలు తీసుకుంటాం

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అనధికార మాంస వ్యర్థాల తరలింపుదారులపై చర్యలు తీసుకుంటామని, టెండర్ ద్వారా వ్యర్థాల తరలింపు కాంట్రాక్ట్ పొందిన ఏజెన్సీనే సోమవారం నుంచి వ్యర్థాలను నిర్దేశిత విధానంలో సేకరిస్తుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో చికెన్, మటన్ షాప్‌ల అసోసియేషన్ ప్రతినిధులు, నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో రోడ్ల వెంబడి అనధికార చికెన్, మటన్, చేపల విక్రయాలు ప్రజారోగ్యం దృష్ట్యా నిషేధమన్నారు. సమావేశంలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, వీఏఎస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, అసోసియేషన్ ప్రతినిధులు కిషోర్ పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావుకు ఘన నివాళి



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటం వద్ద పూల మాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా నాయకులు

లక్ష్మీపురం: అమరజీవి సీపీఐ పూర్వ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు సేవలు మరువలేనివని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ కొనియాడారు. కొత్తపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో రాజేశ్వరరావు వర్ధంతి బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించి ఉత్తమ కమ్యూనిస్టుగా సేవలందించారని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతో ముఖ్య పాత్ర పోషించి నిజాం పాలనకు వ్యతిరేకంగా రైతుల, కార్మికుల హక్కుల కోసం ఉద్యమించారని పేర్కొన్నారు. తన యావత్ 400 ఎకరాల భూమిని పేద ప్రజలకు పంపిణీ చేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయ సాధనకు ముందుకు సాగుదామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడారు.

శ్రీరామ జననంపై ప్రవచనం

నగరంపాలెం: స్థానిక చంద్రమౌళినగర్ హనుమాన్ వీధిలోని శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయం శ్రీరామ దాసు కళావేదికపై శ్రీరామనవమి పండుగ సందర్భంగా బుధవారం శ్రీరామ జననంపై నోరి నారాయణమూర్తి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. త్రేతాయుగంలో వసంత రుతువు చైత్ర శుద్ధ నవమి, గురువారం పునర్వసు నక్షత్రం కర్కాటక లగ్నంలో శ్రీరాముడు జన్మించాడని పురాణాలు పేర్కొంటాయని అన్నారు. శ్రీరాముడు అభిజిత్ ముహూర్తంలో జన్మించారని, శ్రీరాముడికి పట్టాభిషేకం వంటి కార్యక్రమాలను తన ప్రవచనం ద్వారా ఆయన తెలియజేశారు.